

డేటా సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా సర్వే, భూమి రికార్డుల కార్యాలయపు జిల్లా డేటా ప్రోసెసింగ్ సెంటర్ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు కలెక్టరేట్ భవనంలో శుక్రవారం ప్రారంభించారు. డేటా ప్రోసెసింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను పరిశీలించారు. మరొక రెండు కంప్యూటర్లకు కలెక్టరేట్ నుండి నిధుల మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భూ సర్వే, డేటా ప్రీక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే సహాయ సంచాలకులు వై.మోహనరావు, డి.ఆర్.ఓ పి. అంబేద్కర్, డిఐఓ. ఎస్.జి. వెంకటరావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కలెక్టర్

ఓటర్ల జాబితాలు సక్రమంగా ఉండాలి

-ఓటర్ల జాబితా పరిశీలకులు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు

ప్రజాశక్తి-పాడేరు:ఓటరు జాబితా రికార్డులు పటిష్టంగా నిర్వహించాలని ఓటరు జాబితా పరిశీలకులు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు తెలిపారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాల ఎన్నికల, సహాయ ఎన్నికల, బూత్ స్థాయి అధికారులతో ఓటరు జాబితా తయారీ, రికార్డులు నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు ఎన్నికల జాబితా రికార్డులు నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ఓటరు నమోదు, తొలగింపు, మార్పు చేర్పులకు దరఖాస్తు చేసిన వ్యక్తులకు తప్పని సరిగా ఎకనాలెడ్జ్మెంట్ ఇవ్వాలని సూచించారు. ఓటర్ల ఫోటోలు సక్రమంగా ఉండాలన్నారు. జంక్ క్యారెక్టర్స్, ఒకే ఇంటిలో పది ఓటర్లు ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి సవరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఓటర్లను జాబితా నుండి తొలగిస్తే ఎందుకు తొలగిస్తున్నామనేది వివరంగా నమోదు చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ అక్టోబరు 27వ తేదీ నాటికి జిల్లాలో మొత్తం 740573 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అరకు వ్యాలీ, పాడేరు, రంపచోడవరం నియోజక వర్గాల్లో 3,56,969 మంది పురుష ఓటర్లు, 3,83,611 మహిళా ఓటర్లు, ఇతరులు 33 మంది ఉన్నారని వివరించారు. ఈనెల 7 వ తేదీ నాటికి 22,632 మంది కొత్త ఓటర్లను నమోదు చేయడం జరిగిందన్నారు. నిబంధనల మేరకు మృతి చెందిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు 10,459 మందిని ఓటరు జాబితా నుండి తొలగించడం జరిగిందని చెప్పారు. డిసెంబరు 7వ తేదీ నాటికి మొత్తం 7,52,746 ఓటర్లు ఉన్నారన్నారు.

రికార్డులు పరిశీలన

ముందుగా బూత్ స్థాయి అధికారులతో ప్రత్యేకంగా ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు సమావేశ మయ్యారు. జి.కె. వీధి మండలం జి.కె. వీధి, ధారకొండ, అరకు వ్యాలీ మండలం అరకు వ్యాలీ, చొంపి, పద్మాపురం బూత్ల రికార్డులను పరిశీలించారు. ఫారం 6, 7,8లను తనిఖీ చేసారు. ఓటరు జాబితాపై ఓటరు ఫోటో సక్రమంగా ఉండాలని ఆదేశించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, పాడేరు 22 మండలాల తహశీల్దారులు, బూత్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లను నియమించండి

పాడేరు :రాజకీయ పార్టీలు తమ బూత్ ఏజెంట్లను నియమించాలని ఓటరు జాబితా పరిశీలకులు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు తెలిపారు. కలెక్టరేట్‌లో వివిద రాజకీయ పార్టీల నేతలతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ ఏజెంట్లను నియమిస్తే లోపాలు లేకుండా ఓటరు సవరణ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకారం అందించాలన్నారు. పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, చింతపల్లి మండలం కొమ్మంగి గ్రామానికి చెందిన రెండు వందల ఓట్లు ఎర్రబొమ్మలు పోలింగ్ కేంద్రం పరిధిలోకి వెళ్లాయని రెండు కిలో మీటర్లు పైబడి ఉంటుందని వాటిని సవరించాలని కోరారు.



మాట్లాడుతున్న ఉన్నత విద్యాశాఖ మఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు

పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, చింతపల్లి మండలం కిటుముల పంచాయతీ బూసులు కోట గ్రామానికి చెందిన ఓట్లు రెండు కిలో మీటర్లు పైబడి కొండపైన ఉన్న గ్రామం పోలింగ్ పరిధిలోకి మారి పోయాయని వాటిని సవరించాలని కోరారు.ఈ సమవేశంలో జెసి జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఓ వి. అభిషేక్, రంపచోడవం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, డి ఆర్ ఓ పి.అంబేద్కర్, గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు, మాజీ ఎంపిపి సీదరి మంగ్లన్న దొర, సిపిఎం ప్రతినిధి ఎల్.సుందరరావు, బిఎస్పి నేత ఎం.పండన్న, కాంగ్రెస్, బి.జె.పి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

- అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు- జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి -అనంతగిరి:బీంపోలు లువ్వా గోస్థని గెడ్డలో గిరిజనుల గల్లంతుకు సచివాలయం, రెవెన్యూ సిబ్బంది వైఫల్యమే కారణమని ఉమ్మడి జిల్లాల జెడ్‌పి ఛైర్ పర్సన్ జూలిపల్లి సుభద్ర మండిపడ్డారు. శుక్రవారం గల్లంతైన గెడ్డను ఆమె సందర్శించి జరిగిన సంఘటనను స్థానిక కుటుంబ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతపాడు గ్రామంలో మృతుల కుటుంబాలకూ పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ రాయితీలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాశీపట్నం సచివాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. తపాన్ పై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసినప్పటికీ మండల, సచివాలయం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆమె అన్నారు. ప్రమాదం జరిగిన లువ్వా గెడ్డ వద్ద బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని ఆమె అన్నారు.

జడ్పిటిసి గంగరాజు, ఎంపీపీ నీలవేణి మాట్లాడుతూ, ఇప్పటికైనా ఇటువంటి ఘటనలు జరగకుండా మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సన్యాసిరావు, సర్పంచ్ పాగి అప్పారావు, రాష్ట్ర స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ సాగరి సోమేశ్వరి, కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా, మాజీ సర్పంచ్ దేవుడు, వైద్యులు సాగర గణేశ్వరరావు, సందీప్ ఐసిడిఎస్ సిడిపిఓ సంతోషకుమారి, ఏఈ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుభద్ర



ఎఒబిలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశాంతంగా ముగిసిన పిఎల్‌జిఎ వారోత్సవాలు

- ఎఒబిలో ముమ్మరంగా పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు

మావోయిస్టు పార్టీ పిఎల్‌జిఎ వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల 2 నుంచి 8 వరకు ఈ వారోత్సవాలకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పలు విధ్వంస ఘటనలు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్సీ వర్గాలు ముందస్తుగానే హెచ్చరించాయి. దీంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీస్ బలగాలు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సరిహద్దుల్లో వచ్చే పోయే వాహన తనిఖీ చేశారు. ఆంధ్ర ఒడిస్సా పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఎఒబి జల్లెడ పట్టారు. దీంతో మావోయిస్టులు సరిహద్దుల్లో ఎటువంటి వారోత్సవాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క పోలీసుల లక్ష్యంగా మందు పాత్రలు అమర్చి ఉంటారనే కోణంలో బాంబు స్క్వాడ్ బృందాలతో ముందే తనిఖీలు చేపట్టారు. కటాఫ్ ఏరియాల్లో అదనపు బలగాలతో కుమింగ్ విస్తృతం చేశారు. మావోయిస్టు వారోత్సవాల్లో నేపథ్యంలో సరిహద్దుల్లో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని గిరిజనులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం సరిహద్దులు నుంచి పోలీసు బలగాలు కుమింగ్ నుంచి వెనిదిరిగారు.

బిటి రోడ్డు నిర్మించాలని ఆందోళన

ప్రజాశక్త-చింతూరు

మండలంలోని కల్లేరు పంచాయతీ పరిధిలో మధుగూరు గ్రామానికి వెళ్లే రోడ్డు మెటల్ తేలిపోయి అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే బీటీ రోడ్ నిర్మాణం చేపట్టాలని, స్థానిక సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ఆ గ్రామస్తులు రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు మాట్లాడుతూ రోడ్డు బాగాలేక ఆసుపత్రికి వెళ్లాలన్నా కూడా నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పండా నారాయణ, సీతారామయ్య, గంగరాజు, చందరావు మనోజ్, కన్నారావు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న మధుగూరు గ్రామస్తులు

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మావోయిస్టుల పిఎల్ జిఏ వారోత్సవాల నేపద్యంలో స్థానిక ఎసై కె.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్త మయ్యారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ముంచంగిపుట్టు నుంచి పెదబయలు, జోలాపుట్, కుమడ వెళ్లే ప్రధాన రహదారుల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. సీఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు సోదాలు నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు.

పెదబయలు: పిఎల్‌జిఏ వారోత్సవాల సందర్భంగా పాడేరు- పెదబయలు రహదారుల్లో కలవర్టులను పోలీసులు క్షుణంగా పరిశీలించారు.ముందస్తు చర్యల్లో భాగంగా సిబ్బందితో పరిశీలిస్తున్నట్లు ఎస్ ఐ పులి మనోజ్ కుమార్ శుక్రవారం తెలిపారు. రహదారుల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.



గాలిస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

తుపాను నష్టాన్ని అంచనా వేయించాలి

ప్రజాశక్తి-పాడేరు: తుఫాను కారణంగా పాడేరు నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని అంచనా వేయించి, బాధితులను పరామర్శించి భరోసా ఇవ్వడంలో ప్రజాప్రతినిధులంతా నిమగ్నం కావాలని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సూచించారు. పాడేరులోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచులు, ఎంపీటీసీలతో ఆమె సమావేశమయ్యారు. నియోజకవర్గంలో పంటలకు ఎంతెంత నష్టం జరిగిందన్న వివరాలను అంచనా వేయడంలో అధికారులను అప్రమత్తం చేసే బాధ్యతను ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు తీసుకోవాలని సూచించారు. రైతులు కష్టాల్లో ఉన్నప్పుడే అండగా నిలవాలని ఆయన సూచించారు.

లభ్యంకాని ఆచూకీ

ప్రజాశక్తి -అనంతగిరి:లువ్వగెడ్డలో ముగ్గురు గిరిజనులు గల్లంతైన విషయం తెలిసిందే, రెండు మృతదేహాలు గురువారం ఆచూకీ లభ్యమైంది. మిరియాల కమల ఆచూకీ కోసం మూడో రోజు ఎన్ డిఆర్ఎఫ్ బృందాలు, కుటుంబ సభ్యులు గెడ్డలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. గెడ్డ ఉధృతి తగ్గుముఖం పట్టక పోవడంతో ఎన్డీఆర్ ఎఫ్ బృందం తాటిపూడి జలసాయం, మరో బృందం కుటుంబ సభ్యులతో గాలించినప్పటికీ లభ్యం కాలేదు.



గదిలో గాలిస్తున్న సిబ్బంది

తుపాన్ బాధిత రైతులకు

తక్షణ సాయంగా రూ.10 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-చింతూరు

మిచౌంగ్ తుఫాన్ ఏజెన్సీ ప్రాంత రైతాంగానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని, నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం తక్షణసాయం కింద పదివేల రూపాయల నగదు అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యను శుక్రవారం సిపిఎం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ తుఫాన్ వల్ల ఏజెన్సీ ప్రాంతంలో మిర్చి, పత్తి, పొగాకు, మినుము, వరి, నువ్వుల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు చెప్పారు. పంటలను వ్యవసాయశాఖ అధికారుల ద్వారా సర్వే చేసి బాధితులను గుర్తించి పరిహారం చెల్లించాలని కోరారు. గ్రామ సచివాలయ పరిధిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మొట్టుం రాజయ్య, తుమ్మల ఎంపీటీసీ వేకా రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒకు సిపిఎం వినతి



చింతూరు ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న టిడిపి మండల అధ్యక్షులు సురేష్ బాబు

ప్రజాశక్తి- రంపచోడవరం

తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి రంపచోడవరం మండల అధ్యక్షుడు కారం సురేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ముంపునకు గురైన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని పంటను నష్టపోయిన రైతులను గుర్తించి తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కరువు ప్రాంతాలను ప్రకటించి విత్తనాలను తీసుకున్న ప్రతి రైతుకి క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా కూడా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మడకం బాపన్న దొర, టిడిపి నాయకులు సాగర చిన్నాలు దొర, సత్యనారాయణ దొర, చవలం రాంబాబు దొర, కలుమ్ చంద్రరావు దొర, కారం నాగమణి, చవలం బాపనమ్మ, కారం చింతాలు దొర, కలుమ్ శ్రీను, మలగల వీరస్వామి, కారం సంకరు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలి

రాజవొమ్మంగి : తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు ఎకరానికి 50వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని మాజీ సొసైటీ అధ్యక్షులు టిడిపి నేత గనజాల తాతారావ్ డిమాండ్ చేసారు. పంట రైతు చేతికి అందే సమయంలో తుఫాన్ నేపథ్యంలో రైతాంగం తీవ్ర నష్టం చవిచూశారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసంశెట్టి గంగాధర్, బారంగి అనుదీప్, చెక్కా పండుబాబు, చవలా కుమార్, బారంగి రాజబాబు, మార్నిడి రామచక్రం, గురుజు ప్రతాప్, గణజాల మల్లిఖార్జున్, జనసేన నాయకులు పోకల మల్లిఖార్జున్, వడుగుల శ్రీను, గండేపల్లి మణికంఠ, తాటికొండ భవానీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, గిరిజన రైతులు రుణాలను ప్రభుత్వం తక్షణమే మాఫీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంతరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది గిరిజన రైతులు వేసిన వరి, రాజ్మా, అపరాల పంటలు వర్షాలు లేక ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఉన్న అరకొరగా పంటలు ఇటీవల మిచౌంగ్ తుఫానుకు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తక్షణమే అధికారులు స్పందించి జీకే వీధి మండలం 16 పంచాయతీల్లో పంట నష్టాన్ని అంచనా వేసి ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా నష్టపరిహారాన్ని చెల్లించి, రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న బుజ్జిబాబు

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- ఎంపిపి వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అన్నారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాజవొమ్మంగి మండలంలో తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన వివరాలను ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మిల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వారు ఇప్పటికే జిల్లా అధికారులతో మాట్లాడారని తెలిపారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల సూచనల మేరకు 19 గ్రామ పంచాయతీలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని ప్రాంతాలను సందర్శించడం జరిగిందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా పంటనష్టాన్ని, రెవెన్యూ శాఖ ద్వారా ఇల్లు ఇతర ఆస్తి నష్టాలను అంచనా వేయమని ఆదేశించినట్లు చెప్పారు. మండలంలో తుఫాను వల్ల 120 హెక్టర్ల పొలాలు, 60 హెక్టర్ల వరి పనలు, 8 హెక్టర్ల తడిచిన కుప్పల వల్ల నష్టం వాటిలల్లినట్లు అంచనాలు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే రాజవొమ్మంగి మండలంలో రాజవొమ్మంగి, జడ్డంగి, దూసరపాము, శరభవరం, లబ్బర్తి, వాతంగి పాయింట్ల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

పి.ఎర్రగొండ గురుకుల బాలికల కళాశాలకు

మహిళా ప్రిన్సిపల్‌ను నియమించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వై.రామవరం మండలం, పి.ఎర్రగొండ ఎపి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో బాలికల ఇబ్బందుల దృష్ట్యా మహిళా ప్రిన్సిపల్‌ను నియమించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యార్థుల సమస్యలను పట్టించుకోని, కళాశాల ఆఫీసు రూమ్‌లో ప్రిన్సిపల్ అసభ్యకర (రాసలీలలు) పనులు చేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావును సస్పెండ్ చెయ్యాలని విద్యార్థులు ఆందోళన చేసిన నేపథ్యంలో అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కారం చెయ్యాలని కళాశాలకు వచ్చిన గురుకులం జాయింట్ సెక్రటరీకి విద్యార్థులు రాతపూర్వకంగా విన్నవించారని, దీనిపై తమ సంఘం ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. కళాశాల గేటు ముందు విద్యార్థులు ధర్నా చేపట్టగా, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్న రామకృష్ణ ధర్నా వద్దకు వచ్చి సమస్యలన్నింటినీ పరిష్కారం చేస్తానని చెప్పారన్నారు. ఆ సమయంలో ఫోన్‌లో మాట్లాడిన గురుకులం సెల్ జాయింట్ సెక్రటరీ, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే తక్షణమే ప్రస్తుత ప్రిన్సిపల్‌ని తొలగించి, బాలికల కళాశాలలో మహిళ ప్రిన్సిపాల్‌ను మాత్రమే నియమించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న రామారావు

దొన్నుదొర నియామకంపై హర్షం



ర్యాలీలో హుకుంపేట సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - హుకుంపేట: అరకులోయ నూతన ఇంచార్జిగా సివేరి దొన్నుదొరను తెలుగు దేశం పార్టీ అధిష్ఠానం ఇటీవల కాలంలో నూతనంగా నియమించిన విషయం విదితమే. హైదరాబాద్ నుండి వచ్చిన ఆయనకు టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, సర్పంచులు, ఎంపీటీసీలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సోమెలి సత్యవతి, పాంగి బాలన్న, మాజీ సర్పంచులు శకర బొంజు బాబు, టిడిపి నేతలు బొర్ర శ్యామ్, యస్‌టి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొర్రా సంతోష్ కుమార్, నాగేష్, వెంకటరావు, సుబ్బారావు, పండన్న పాల్గొన్నారు.

అనంతగిరి: అరకులోయ అసెంబ్లీ నియోజక వర్గానికి సివేరి దొన్నుదొరకు టిడిపి అధిష్ఠానం బాధ్యతలు అప్పగించడంపై శుక్రవారం చిలకలగెడ్డ వద్ద ఆ పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. కాశీపట్నం, శివలింగపురం, డముకు, ములియగుడ, అనంతగిరి, కొత్తవలస మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ విజయానికి కార్యకర్తలు అందరితో కలిసికట్టుగా పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జె.అప్పారావు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తుపానుతో 31 మూగజీవాలు మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: తుపాన్ కారణంగా మండలంలో 31 మూగజీవాలు మృత్యువాతకు గురయ్యాయని కాశీపట్నం, అనంతగిరి, పశువైద్య శాఖల వైద్య అధికారులు సాగర గణేశ్వరరావు, సంధీప్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 పంచాయతీ పరిధిలో 18 రైతులకు చెందిన 31 పశువులు, మేకలు, గొర్రెలు మృతి చెందాయని ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందన్నారు. రైతులు పూర్తి వివరాలతో పాటు బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డు పశుసంవర్ధక శాఖకు అందజేయాలని పేర్కొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో విజయవంతంగా అరుదైన కంటి ఆపరేషన్

ప్రజాశక్తి - వేపగుంట : నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో గ్లకోమా నివారణకు అరుదైన గ్లూకోస్ ఐ-స్టెంట్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. గ్లకోమా రోగులలో కంటి లోపల ఒత్తిడిని గణనీయంగా తగ్గించి, వ్యాధిని అదుపులో ఉంచడానికి గ్లూకోస్ ఐ స్టెంట్ అనే అతి సూక్ష్మ పరికరాన్ని కంటిలో అమర్చే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. అమెరికాలోని గ్లూకోస్ ఇంటర్నేషనల్ సంస్థ 2012లో ఐ-స్టెంట్ పరికరానికి అమెరికా ఎఫ్‌డిఎ అనుమతి పొంది వినియోగిస్తోంది. 2018లో దీన్ని మరింత ఆధునీకరించి, 360 మైక్రోమీటర్ పరిమాణంలో టైటానియం మెటల్ రూపొందించారు. గతనెలలో భారత్‌లో అందుబాటులోకి తెచ్చిన ఈ అతిసూక్ష్మ పరికరాన్ని, ఇంతలోనే శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో వినియోగించడం, విజయవంతంగా ఆపరేషన్ చేసి గ్లకోమా రోగులకు అమర్చారు. గ్లూకోస్ ట్రాబెక్యులర్ మైక్రో బైపాస్ టెక్నాలజీ ద్వారా రెండు బైపాస్ మార్గాలు ఏర్పరచి కంటి లోపల ద్రవాన్ని స్కెల్మెన్ ద్వారం ద్వారా ప్రవహించడానికి ఈ స్టెంట్‌ను అమర్చే ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా అత్యాధునిక ఆపరేషన్‌ల నిర్వహణలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి మరోమైలురాయి చేరుకుంది. అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన శంకర్ ఫౌండేషన్ గ్లకోమా వైద్యుల బృందాన్ని యాజమాన్యం అభినందించి

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



హుకుంపేటలో పాడైన రాజ్మాపంటను పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పలు పంచాయతీ గ్రామాల్లో రాజ్ మా పంటలు పూర్తిగా దెబ్బతిందని, రైతుకు రూ .25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు కోరారు. మండలంలోని చీకుమద్దుల పంచాయితీ ముసిరి పాడులో తుపానుకు దెబ్బతిన్న రాజ్‌మా పంటను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా రాజ్ మా, కందులు తడిసి పూర్తిగా పాడై పోయాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పరిహారం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముసిరిపాడు వార్డు మెంబర్ కొండ తాబేలి సురేష్, గ్రామ పెద్దలు ఆనంద్, రాయుడు, రాజారావు, శ్రీహరి, చిన్నారావు, శ్రీను, సన్యాసిరావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన గిరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వరి, విజయలు డిమాండ్ చేశారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ దారపల్లి గ్రామంలో తుఫాను కారణంగా వరి, రాగులు, సాములు దెబ్బతిన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంతో కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో తుపాను కారణంగా దెబ్బ తినడం బాధాకరమన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోయిన రైతులను గుర్తించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సీసా భగత్ రాం, గొల్లోరి నాగయ్య, కొర్ర రాజ పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో తుపాన్ కారణంగా ఇల్లులు, పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని జనసేన మండల నాయకులు మజ్జి కృష్ణంరాజు కోరారు. వర్షానికి కూలిన కెరంగి గుండన్న ఇల్లును జనసేన నేతలు శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బుద్ధు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి.

చింతపల్లి: పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వమే ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణతో కలసి శుక్రవారం చింతపల్లి వచ్చిన ఆయన పార్టీ శ్రేణులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంటలు చేతికి వచ్చే సమయంలో తుఫాను ప్రభావంతో గిరి రైతులు నష్ట పోయారన్నారు. వేలాది ఎకరాలలో పంటలు నష్టపోయిన గిరి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు షేక్ రహ్మాన్ పాల్గొన్నారు.

నేడు ఎయు పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశం

-ముఖ్య అతిథిగా టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్

-బీచ్‌రోడ్డు ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా కార్యక్రమాలు



టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చంద్రశేఖరన్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశం వేవ్స్ 2023 శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ వేడుకను నిర్వహిస్తారు. ఈ సంవత్సరం పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశానికి టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 5 నుంచి ప్రధాన కార్యక్రమం జరుగుతుంది. ఏయూ అలుమ్ని అసోసియేషన్ వ్యవస్థాపక చైర్మన్, జిఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత జి.ఎం రావు అధ్యక్షత వహిస్తారు. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ఏయూలో స్టార్టప్ ఇంకుబేషన్ సెంటర్‌ను, పలు ప్రయోగశాలలు సందర్శిస్తారు. అనంతరం ప్రత్యేక సావనీర్‌ను వేదికపై ఆవిష్కరిస్తారు. దేశ విదేశాల నుంచి పూర్వవిద్యార్థులు పాల్గొనున్నారు. శనివారం ఉదయం ప్రతీ విభాగంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు నిర్వహిస్తారు. వీటిలో ఆయా విభాగాల పూర్వవిద్యార్థులు హాజరవుతారు. వీరంతా మధ్యాహ్నం నుంచి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ప్రధాన సమావేశానికి హాజరవుతారు.

హాస్టల్ మెస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎయు రిజిస్ట్రార్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మెస్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావుతో కలిసి గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత స్వయంగా పరీక్షించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేసారు. భోజనం రుచి, నాణ్యత స్వయంగా పరిశీలించారు. భోజన తయారీ, సరఫరాలో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రమైన ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య కె.నాగేశ్వర రావు, ఆచార్య జి.వీర్రాజు పాల్గొన్నారు.

ఎంఇఒ సందర్శన



సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-పాడేరు : మండలంలోని డి.గొందూరు, కరకపుట్టు గ్రామాల్లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు సందర్శించారు.. ఈ సందర్భంగా ఆయన సమ్మేటివ్ అసెస్మెంట్ వన్ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఎస్‌డిసి శ్రీధర్‌కు సత్కారం



ఎస్‌డిసి శ్రీధర్‌ను సన్మానిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలోని చింతూరు డివిజన్ విఆర్ పురం మండల తహసీల్దార్‌గా పని చేస్తూ ఇటీవల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన శ్రీధర్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు బమ్మిడి చిన్నికృష్ణ, కార్యదర్శి వంజంగి త్రినాథ్‌రావు నాయుడు తదితరులు ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీమా తక్షణసాయం అందజేత



బీమా తక్షణసాయాన్ని అందజేస్తున్న కన్వీనర్

ప్రజాశక్తి - చింతపల్లి: వైయస్సార్ బీమా ప్రతి నిరుపేద కుటుంబానికి ధీమా అని బెన్నవరం సచివాలయ కన్వీనర్ బచ్చల బొజ్జన్నదొర అన్నారు. స్థానిక సర్పంచ్ బచ్చల సన్యాసమ్మ, సచివాలయ కన్వీనర్ బచ్చల రమణమ్మతో కలిసి ఆ పంచాయతీలోని కట్టువీధి గ్రామంలో ఇటీవల మరణించిన మామిడి చిలకమ్మ కుటుంబీకులకు బీమా తక్షణసాయం కిందరూ. పది వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ సారధి జోసెఫ్, వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత, వాలంటీర్లు సుదీర్, యోహాను పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే అందిస్తుందని ఎంపిపి బడుగు రమేష్ అన్నారు. మండలంలోని కొమ్మిక గ్రామ సచివాలయంలో శుక్రవారం ఎపికి జగన్ ఎందుకు కావాలని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, జెసిఎస్ కన్వీనర్ సుధాకర్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సర్పంచ్ సెగ్గే సూరిబాబు, ఎంపిటిసి కమతం అర్జమ్మ, సుర్ల లోవరాజు, నాయకులు ధోని బాబ్జి, శేఖర్, గంగరాజు, చల్లారావు, రమణ, లక్ష్మణరావు, దేవుడు, సన్యాసిరావు, కంఠారం సర్పంచ్ రమణ, వైస్ సర్పంచ్ వనం బాబు, బకులూరు సర్పంచ్ పొట్టిక శ్రీను పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ సంచార వైద్యశాల ఆధ్వర్యాన మండలంలోని సిరిగిందలపాడులో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్వామి పరిజ్ఞాయానంద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన వ్యాధులకు, ఆయాసం, దడ, బిపి, షుగర్, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్ల నొప్పులు, ఫిట్స్, చర్మవ్యాధులు, కంటి వ్యాధులు, స్త్రీల వ్యాధులు, పిల్లల వ్యాధులతో పాటు సామాన్య రోగాలకు వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరానికి వచ్చే రోగులు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని అంతాడ పంచాయతీ పరిధి మునసాల గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊట గెడ్డ నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు, పాలకులకు తెలియజేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

గంజాయి అక్రమ రవాణాను అరికడతాం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణాను అరికట్టడానికి కార్యచరణ రూపొందిస్తున్నామని మారేడుమిల్లి సీఐ రుద్ర రాజు భీమరాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. జిల్లా ఎస్సీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్ళి పర్యవేక్షణలో గంజాయి ఆక్రమ రవాణాపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, పలు మార్గలో చెక్ పోస్టులు కూడా ఏర్పాటు చేసామని తెలిపారు. గంజాయి వల్ల జరిగే అనర్ధాలు, నష్టాలు గురించి యువత, ప్రజల్లో అవగహన కల్పిస్తామన్నారు. మారేడుమిల్లికి దూర ప్రాంతాలు నుంచి వచ్చే పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తామన్నారు. రిసార్ట్స్, రూమ్స్ అసాంఘిక కార్యకలపాలకు తావులేకుండా ప్రతి వారం తనిఖీలు చేపడతామని చెప్పారు. ఎవరైనా నిబంధనలు విరుద్ధంగా వ్యవహారిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓట్ల తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించిన వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘానికి విశాఖకు చెందిన తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ఫిర్యాదు చేశారు. అనంతరం అమరావతిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి తను చేసిన ఫిర్యాదుపై ఎలక్షన్ కమిషన్ స్పందించిన తీరును వివరించారు. అనంతరం మీడియాతో రామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జైలులో ఉంటేనే ప్రజలు క్షేమంగా ఉంటారన్నారు. విశాఖపట్నం నుంచి పరిపాలన సాగిస్తానని చెప్పిన జగన్ మరోసారి మాట తప్పారని అన్నారు. ఓట్ల తొలగింపులో వాలంటీర్ వ్యవస్థ కీలకంగా పనిచేసిందన్నారు.

గరుడ యాప్ ద్వారా 24 లక్షలకుపైగా ఓట్లను తొలగించిన విషయాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఈ క్రమంలోనే 10 సంవత్సరాల నుంచి బెయిల్‌పైన ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎన్నికలలో పాల్గొనకుండా నిరోధించాలని కోరినట్టు తెలిపారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు రాష్ట్రంలో పర్యటించాల్సిందిగా అభ్యర్థించానన్నారు. ఇదే ఫిర్యాదు కాపీని రాష్ట్రపతి, ప్రధానమంత్రి, హోం శాఖ మంత్రి కార్యాలయాలతో పాటు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో కూడా సమర్పించినట్టు తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ఓటు హక్కును తొలగించే అధికారం ఎవరికీ లేదన్నారు.

మొరాయించిన విశాఖ-భద్రాచలం బస్సు



నిలిచిపోయిన బస్సు

ప్రజాశక్తి -సీలేరు

విశాఖపట్నం నుండి భద్రాచలం వెళ్లే అల్ట్రా డీలక్స్ బస్ సర్వీస్ సాంకేతిక లోపాలు తలెత్తడంతో సీలేరులో మొరాయించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. విశాఖపట్నం డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీస్ విశాఖ కాంప్లెక్స్‌లో ఉదయం ఐదు గంటలకు బయలుదేరి వయా నర్సీపట్నం సీలేరు మీదుగా భద్రాచలం వెళ్ళవలసి ఉండగా, సీలేరు పోస్ట్ ఆఫీస్ సమీపానికి వచ్చేసరికి బస్సులో సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోయింది. బస్సు డ్రైవర్ సాంకేతిక లోపాలు పరిశీలించగా రేడియేటర్ వెనుక ఉన్న ఫ్యాన్ బెల్ట్ తెగిపోయినట్లు గుర్తించారు. ఆర్టీసీ యాజమాన్యానికి సమాచారం చేరవేయడంతో అధికారులు స్పందించి నర్సీపట్నం డిపో చెందిన నర్సీపట్నం - సీలేరు బస్ సర్వీస్‌లో ప్రయాణికులకు తరలించారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రయాణాలకు ఎటువంటి సమస్య తలెత్తకుండా కండిషన్ కలిగిన బస్సులు దూర ప్రాంతాలకు నడపాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి రేలాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఫిబ్రవరి 10, 11 తేదీలలో చింతూరు మండల కేంద్రంలో జరుగు జాతీయస్థాయి ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనం, 5వ రేలా పండూం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడియం మురళి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతి గృహం వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామగ్రామాన ఆదివాసీ జెండాలు ఎగురవేయాలన్నారు. ఫిబ్రవరి 10, 11 తేదీలలో జరుగు రేలా పండూం సందర్భంగా ఆదివాసి హక్కులు, చట్టాలు, జీవోలు, కోయ బాల సాహిత్యం, ఆదివాసీ సంస్కృతి, భారత రాజ్యాంగం అనే అంశాలపై సెమినార్ నిర్వహించటం జరుగుతుందని చెప్పారు.

వివిధ రాష్ట్రాల ఆదివాసీ కళాకారులచే ఆదివాసీ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చేవారు ముందుగా 9642067386, 9573946097 ఫోన్ నెంబర్లకు సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, అందాల లింగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబరాన్ని తాకిన కొండగుడి సంబరం

ప్రజాశక్తి -కలెక్టరేట్ : పాత నగరంలోని కొండ గుడి పండగగా పేరొందిన అమలోద్భవి (మేరీ) మాత ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు కొండపై ఉన్న లూర్ధుమాత గుహ వద్ద తెలుగులో, ప్రధాన దేవాలయంలో ఆంగ్లంలో దివ్యపూజా బలి నిర్వహించడం ద్వారా ఉత్సవాల ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం గుహ వద్ద విశాఖ అగ్రపీఠాధిపతులు డాక్టర్ మళ్లవరపు ప్రకాష్‌చే పోంటిపికల్ దివ్య పూజా బలిని నిర్వహించారు. భక్తులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ సర్వ మానవాళి కోసం మేరీమాత చేసే ప్రార్థనలను అందరూ అనుసరించాలన్నారు. దివ్య పూజా బలిని నగరంలోని వివిధ చర్చిలకు చెందిన ఫాదర్లు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. మధ్యాహ్నం పాత పోస్టాఫీసు వద్ద ఉన్న సెయింట్ ఆలాయిసిస్ పాఠశాల నుంచి అశేష భక్తజనం మేరీ మాత స్వరూప తేరును ప్రదక్షిణగా కొండపై ఉన్న ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. భక్తుల సందర్శనార్థం ఆలయం బయట ఉంచారు. అనంతరం భక్తులంతా మొక్కులు చెల్లించుకున్నారు. మేరీ మాత ముందు మోకరిల్లి కష్టనష్టాలను చెప్పుకున్నారు.చివరిగా లూర్థుమాత గుహ వద్ద దివ్య పూజా బలితో మహోత్సవాన్ని ముగించారు.

కిక్కిరిసిన దారులు

అమలోద్భవి మాత దర్శనానికి భక్తులు పోటెత్తడంతో టౌన్ కొత్త రోడ్డు నుంచి పాత పోస్టాఫీసు వరకు దారులన్నీ కిక్కిరిసిపోయాయి. కొండపై ఆలయ ప్రాంగణం ఇసుక వేస్తే రాలనంతగా తయారైంది. నగరంతోపాటు ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వేలాది మంది భక్తజనం తరలివచ్చారు.

పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోలేదు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, సూచనల బోర్డులు పక్కాగా ఏర్పాటు చేయడంతో భక్తులు సాఫీగా రాకపోకలు సాగించారు.

రైతులను ఆదుకుంటాం : ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి - దేవరాపల్లి : తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.అలమండ పరిసర ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా తడిచి ఆరబెట్టిన ధాన్యం రాశులను, దెబ్బతిన్న పంటలను ఆయన అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పటాన్ శెట్టితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల నుంచి కూడా ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. సబ్సిడీపై మినుము విత్తనాలు సరఫరా చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పంట పొలాల్లో తడిచిన కంకులపై ఉప్పు నీటి ద్రవాన్ని మంత్రి పిచికారీ చేశారు.

పాఠశాలలో 'స్వచ్ఛ భారత్ అభియాన్'

ప్రజాశక్తి - సీలేరు : సిఆర్పిఎఫ్ జి42 బెటాలియన్ ఆధ్వర్యంలో జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఆర్పిఎఫ్ డి.ఎస్.పి సురేష్ ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్సీ వైద్య అధికారి సౌమ్య మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రత పాటిస్తే రోగాలు బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. చెత్తాచెదారం పేరుకుపోతే దోమలు వృద్ధి చెందిన తద్వారా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుందరం, ఉపాధ్యాయులు కాలేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐగా స్వామినాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి సీఐగా అల్లు స్వామినాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సిఐగా పనిచేసిన బాజీలాల్ కొయ్యూరు సీఐగా బదిలీపై వెళ్లగా, కొయ్యూరు సీఐ స్వామినాయుడు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా సిఐ స్వామి నాయుడును రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు ఎస్ వెంకయ్య, పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం స్వామి నాయుడు మాట్లాడుతూ, మండలంలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

వైసిపి నుంచి 30 మంది టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని గులేటివాడ గ్రామంలో వైసిపి చెందిన 30 కుటుంబాలు టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు ఆధ్వర్యాన శుక్రవారం టిడిపిలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసిపి ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి, సంక్షేమం, రోడ్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల కల్పన చేయలేదని పేర్కొన్నారు. వైసిపిపై విసుగు చెంది టిడిపిలో చేరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బురక కన్నారావు, బీరక సూర్య ప్రకాష్, చవలం రాజేంద్రప్రసాద్, పెందుర్తి సుదర్శన్ రావు, అకోజు భాగ్య లక్ష్మి, ముత్యాల సిద్ధు, అచ్చిరాజ్, పాయం రామారావు, మిడియం వీరయ్య, రంగాచారి, తెల్లం అప్పారావు, బోధిబోయిన సురేష్, బేరి వెంకన్న, మోసం ప్రభాకర్, కదలసూరపు రెడ్డి, సూత్రు ఎర్రపరెడ్డి, సాధన రామిరెడ్డి, సాధల పోచమ్మ,గంగమ్మ, పెద్ద లక్ష్మి పాల్గొన్నారు.

కెన్యా ఓపెన్ యూనివర్సిటీతో ఇగ్నో ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విద్యా రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. న్యూఢిల్లీలో జరిగిన ఓ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో కెన్యా ఓపెన్ యూనివర్సిటీతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకొని సంతకాలు చేసినట్టు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు జి.ధర్మారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, కెన్యా అధ్యక్షులు విలియం సమోయి రూటోల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు, కెన్యా విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారన్నారు. ఒప్పందంలో భాగంగా ఇగ్నో - కెన్యా ఓపెన్ యూనివర్సిటీల మధ్య వివిధ అంశాలలో పరస్పర సహకారం ఉంటుందని, రెండు సంస్థల మధ్య విద్యార్థులు, అధ్యాపకులు, అత్యున్నత సాంకేతికత సహకారంతో విద్యాబోధన, కెన్యా ఓపెన్ యూనివర్సిటీ సిబ్బందికి శిక్షణ, ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సుల రూపకల్పన, ఆన్ లైన్ విద్యాబోధనలో సహకారం అందించడం, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో చేయూతనివ్వడం, విద్యా సంబంధిత వనరులు పంచుకోవడం వంటివి ఈ ఒప్పందంలో భాగమన్నారు.

10న విశాఖలో గవర్నర్ పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ నెల 10న ఆదివారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఆ రోజు ఉదయం 11:20 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 12:30 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడి నుంచి 12:40 గంటలకు పోర్టు గెస్ట్ హౌస్‌కు వెళ్తారు. విశ్రాంతి అనంతరం పోర్ట్ గెస్ట్ హౌస్ నుంచి ఆర్‌కె బీచ్‌కు చేరుకొని 4:12 గంటల నుంచి 5:35 గంటల వరకు నేవీ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం 5:40 గంటలకు సిరిపురం నేవీ హౌస్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక తేనేటి విందులో పాల్గొంటారు. 7:20 గంటలకు మరలా ఐఎన్ఎస్ డేగాకు చేరుకొని అక్కడి నుంచి 7:30 గంటలకు ప్రత్యేక విమానం ద్వారా విజయవాడ వెళ్తారు.